



పూజలందుకున్న సరస్వతిదేవి

అవగాహనతో కేన్సర్ దూరం

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న బాధితులు
- సకాలంలో చికిత్స పొందితే బయటపడొచ్చు
- నేడు ప్రపంచ కేన్సర్ దినం

అవగాహన.. ముందస్తు జాగ్రత్తలతో కేన్సర్ నుంచి సులువుగా బయటపడొచ్చని వైద్యులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో నోటి, రొమ్ము , గర్భాశయ కేన్సర్ బాధితులు ఎక్కువగా ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ప్రధానంగా పొగాకు సంబంధిత వస్తువుల వినియోగం వల్ల అత్యధికులు నోటి కేన్సర్ బారిన పడుతున్నారు. విజయనగరం జిల్లా ఆసుపత్రిలో కేన్సర్ వ్యాధి నిర్ధారణ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా మేల్కొని సకాలంలో చికిత్స పొందితే కేన్సర్ ప్రమాదం కాదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



(పూర్తి వివరాలు 6వ పేజీలో...)

ఘనంగా వసంత పంచమి

- జ్ఞాన సరస్వతి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జ్ఞానసరస్వతి ఆలయంలో వసంత పంచమిని పురస్కరించుకుని సోమవారం సామూహిక అక్షరాభ్యాసాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి సరస్వతిదేవికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి బ్యాచ్‌ల వారీగా అక్షరాభ్యాసాల్ని చేపట్టారు. ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తులాభారం కూడా నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక సదుపాయాలు కల్పించారు.



సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు

కదలవు.. వదలవు

- భామిని మండలంలో గజరాజుల హల్‌చల్
- ఈ ప్రాంతంలోనే వాటికి ఇష్టమైన పంటలు
- ఆహారానికి.. తాగునీటికీ నో ప్రాబ్లమ్
- కొన్నేళ్లుగా ఇక్కడే తిష్ఠ వేసిన నాలుగు ఏనుగులు
- ఒడిశాకు వెళ్లినా.. కొద్దిరోజులకే వెనక్కి.
- యథేచ్ఛగా పంటలు, వ్యవసాయ పరికరాల ధ్వంసం
- కొన్నిసార్లు గ్రామస్థులపైనా దాడి
- ప్రత్యామ్నాయంగా రైతులు సాగు చేపట్టినా.. ఫలితం శూన్యం
- తక్షణమే ఏనుగులను తరలించాలని ప్రజల డిమాండ్



ఘనసర-తాలాడ వ్యవసాయ భూముల్లో సంచరిస్తున్న ఏనుగులు

భామిని, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భామిని మండల వాసులను గజరాజులు హడలెత్తిస్తున్నాయి. కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రైతులకు పొలాలకు వెళ్లకుండా చేస్తున్నాయి. ఒడిశా నుంచి వచ్చిన నాలుగు ఏనుగులు కొన్నాళ్లుగా ఈ ప్రాంతంలోనే సంచరిస్తూ.. స్థానికులను వణికిస్తున్నాయి. యథేచ్ఛగా పంటలు, వ్యవసాయ పరికరాలను నాశనం చేస్తూ రైతన్నలకు తీవ్ర వేదనను మిగిలిస్తున్నాయి. కొన్నిసార్లు గ్రామస్థులపై దాడులు చేస్తున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు. ఈ ప్రాంత రైతులు పండించే పంటలు వాటికి ప్రధాన ఆహారంగా మారాయి. దీంతో భామిని మండలం నుంచి అవి కదలడం లేదు.

ఇదీ పరిస్థితి..

- జిల్లాలో మొత్తంగా 11 ఏనుగులు ఉన్నాయి. భామిని మండలంలో నాలుగు, జియ్యమ్మవలస, గరుగుబిల్లి, కొమరాడ, కురుపాం తదితర మండలాల్లో ఏడు గజరాజులు కొన్నేళ్లుగా హల్‌చల్ చేస్తున్నాయి. భామిని మండలం విషయానికొస్తే.. తాలాడ, కోసలి, కీసర, ఘనసర, పసుకుడి తదితర గ్రామాలను అవి వదలడం లేదు. ఈ ప్రాంతంలో వాటి ఆహారానికి, తాగునీటికి ఎటువంటి ఇబ్బంది ఉండడం లేదు. ఇష్టమైన పంటలు, తాగడానికి వంశధార నది నీరు , మరోవైపు పొలాల్లో బోర్లు ఉండడంతో ఘనసర, తాలాడ తదితర గ్రామాలను అవి విడిచి వెళ్లడం లేదు. ఒక్కోసారి వంశధార నది నాటి ఒడిశా వైపు వెళ్లినా కొద్దిరోజులకే మళ్లీ భామిని మండలానికి చేరుకుంటున్నాయి.
- చెరకు, అరటి, మొక్కజొన్న పంటలను ఇష్టంగా తింటాయి. అటవీ శాఖాధికారులు చెప్పే లెక్కల ప్రకారం సాధారణంగా ఒక ఏనుగు రోజుకు 450 కిలోలను ఆహారంగా తీసుకుంటుంది. మొక్కజొన్న, వరి, కర్బూజను వేగంగా తింటాయి.
- వాస్తవంగా తాలాడ, కోసలి, కీసర, ఘనసర, పసుకుడి తదితర గ్రామాలు నదీతీర ప్రాంతంలో ఉన్నాయి. వర్షాకాలంలో పంటలు ముంపునకు గురవడంతో చెరకు పంట వైపు వారు మొగ్గు చూపారు.



చెరకు పంటను ధ్వంసం చేసిన ఏనుగులు (ఫైల్)

దాదాపుగా 250 నుంచి 400 ఎకరాల వరకు గతంలో చెరకు పండించేవారు. అరటి, కూరగాయలు, వరి సాగు చేసేవారు.

- ఏనుగులకు అతిగా ఇష్టపడే చెరకు, అరటిని పండించొద్దని అటవీశాఖాధికారుల సూచించడంతో గతేడాది నుంచి ఆయా ప్రాంత రైతులు మొక్కజొన్న సాగు చేపట్టారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొద్ది విస్తీర్ణంలో వరి పండిస్తున్నారు. అయినప్పటికీ వారికి ఏనుగుల బెడద తప్పడం లేదు. గజరాజులు మొక్కజొన్న పంటను కూడా ధ్వంసం చేస్తున్నాయి. సోలార్ ప్యానెళ్లు, వ్యవసాయ మోటార్లను నాశనం చేస్తున్నాయి. దీంతో ఆగ్రహించిన రైతులు ఇటీవల ఘనసర గ్రామంలో అటవీశాఖ ఉద్యోగులను అడ్డగించిన విషయం తెలిసిందే. చివరకు ఉన్నతాధికారుల హామీతో వారు శాంతించారు.
- ప్రస్తుతం ఏనుగులు మొక్కజొన్న పొలాల్లోనే సంచరిస్తుండడంతో రైతులు బెంబేలెత్తి పోతున్నారు. వాటి కారణంగా పంట పొలాల్లోకి వెళ్లేందుకు సాహించలేకపోతున్నామని వాపోతున్నారు. ఇప్పటికే వాటి దాడిలో కొందరు ప్రాణాలు కోల్పోయారు. సాగు చేయడమే కష్టంగా మారింది. భవిష్యత్‌లో మరింత పంట, ప్రాణ నష్టం సంభవించకముందే అటవీ శాఖాధికారులు స్పందించాలని.. ఏనుగుల తరలింపునకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకుంటే మేలు..

- గజరాజుల గుంపు పొలాల్లోకి రాకుండా ఉండాలంటే రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు

(మిగతా 8వ పేజీలో...)

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించాలి

- కూటమి శ్రేణులకు మంత్రి సంధ్యారాణి పిలుపు

పార్వతీపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించాలని, కూటమి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. సోమవారం పార్వతీపురంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అధ్యక్షతన కూటమి శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ... 'గత వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులను అనేక ఇబ్బందులకు గురిచేసింది. కనీసం ఒకటో తేదీన జీతాలు కూడా అందించలేకపోయింది. నాడు మద్యం దుకాణాల వద్ద గురువులకు విధులు కేటాయించిన పరిస్థితి. వివిధ యాప్‌లతో ఉక్కిరిబిక్కిరి చేసేవారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల పరిశుభ్రత బాధ్యత కూడా వారిపై పెట్టి చులకనగా చూసేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఉపాధ్యాయులను గౌరవిస్తూ పాలన సాగిస్తున్నారు. టీచర్ల మద్దతుతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి పెద్దలు నిర్ణయించిన అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేష్‌చంద్రదేవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, జనసేన నాయకులు పాలూరు బాబు, నాలుగు నియోజకవర్గాల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

శ్యామలాంబ ఘటాలకు తొలిపూజ

- సంప్రదాయబద్ధంగా హారతులు
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రజలు
- సాలూరులో మొదలైన సందడి

6లో

నేడు శంబర మారువారం జాతర

- భారీగా తరలి రానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి

టెక్నాలజీపై పరిణతి సాధించాలి: ఎస్పీ

బెలగాం, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల దర్యాప్తునకు ఉపయోగించే టెక్నాలజీపై పరిణతి సాధించాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో సైబర్ సెల్, ఐటీ కోర్ టీం అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. సైబర్ నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ మోసాలపై ఎవరైనా 1930కు ఫిర్యాదు చేస్తే వెంటనే దర్యాప్తు చేపట్టి బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేయించాలన్నారు. పోలీస్ సిబ్బందికి సైబర్ నేరాల సాంకేతికతపై ప్రతి శనివారం శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు.



ఇలా అయితే.. సాగు ఎలా?

ఇది జియ్యమ్మవలస మండలం పెద్దబుడ్డిడి వద్ద ఉన్న చప్టా . బ్రిటీష్ కాలంలో నిర్మించిన దీని నుంచి పూర్తి స్థాయిలో ఆయకట్టుకు నీరందడం లేదు. వాస్తవంగా తోటపల్లి ఎడమ కాలువ నుంచి ఈ సైఫూన్ ద్వారా వీరఘట్టం, పాలకొండ మండలాల్లో సుమారు 20 వేల ఎకరాలకు నీరందాల్సి ఉంది. అయితే కొంత నీరు ఒట్టిగెడ్డలో కలిసి పోగా.. మరికొంత సైఫూన్ లీక్‌ల కారణంగా వృథా అవుతుంది. దీంతో శివారున ఉన్న ఐదు వేల ఎకరాలకు నీరందడం లేదు. దీంతో ఏటా ఆయా ప్రాంత రైతులు వరుణుడిపై ఆధారపడి సాగు చేపట్టాల్సి వస్తోంది. ఈ సైఫూన్ స్థానంలో అక్విడెక్ట్ నిర్మిస్తే అన్నదాతలకు సాగునీటి కష్టాలు తప్పుతాయి. అయితే ఈ ప్రతిపాదన కొన్నేళ్లుగా చర్చలకే పరిమితమైంది. అక్విడెక్ట్ నిర్మాణ విషయాన్ని ఎమ్మెల్యే జయకృష్ణ దృష్టికి తీసుకొని వెళ్లి నిధులు మం జూరయ్యేలా కృషి చేస్తామని తోటపల్లి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ విజయరమణి తెలిపారు.

- వీరఘట్టం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి)



ఓం నమో సూర్యాయ

- అరసవల్లి ఆదిత్యుని ఆలయంలో అర్ధరాత్రి నుంచి ఆరంభమైన క్షీరాభిషేకం
- రథసప్తమి వేడుకకు భారీగా భక్తుల రాక
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

6లో



క్షణక్షణం ఉత్కంఠ

- పాలకొండ చైర్‌పర్సన్ పీఠంపై వీడని చిక్కుముడి
- వాయిదా పడిన ఎన్నిక.. నేడు నిర్వహణ

పాలకొండ, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎన్నిక సోమవారం క్షణక్షణం ఉత్కంఠగా సాగింది. అయినప్పటికీ పీఠంపై చిక్కుముడి వీడలేదు. చివరకు వాయిదా పడింది. ఈ నెల 4న మరోసారి చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ చేపట్టనున్నట్లు ఎన్నికల అధికారి యశ్వంత్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. తొలుత నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ పదవికి అర్హత ఉన్న ఎస్టీ రిజర్వుడు అభ్యర్థి రెండో వార్డు కౌన్సిలర్ ఆకుల మల్లీశ్వరి నామినేషన్ దాఖలు చేశారు. వైసీపీ గుర్తుతో గెలిచిన ఆమెకు ఆ పార్టీ సభ్యులు బీఫారం అందించారు. అయితే తాను స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని మల్లీశ్వరి తెలిపారు. వైసీపీ బీ ఫారం ఇవ్వడంతో ఆ పార్టీ అభ్యర్థిగానే రికార్డుల్లో నమోదు చేశామని ఎన్నికల అధికారి యశ్వంత్ కుమార్‌రెడ్డి తెలిపారు. అయితే తన స్వతంత్ర అభ్యర్థిత్వాన్ని పరిగణలోకి తీసుకోవాలని మరోసారి మల్లీశ్వరి కోరారు. దీనికి ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కూడా మద్దతు తెలిపారు. అయితే వైసీపీ కౌన్సిలర్లు వెలమల మన్మథరావు, దుప్పాడ పాపినాయుడు మాత్రం ససేమిరా అన్నారు. దీంతో కొద్దిసేపు వైసీపీ, కూటమి సభ్యుల మధ్య సంవాదం నడిచింది. కొద్దిసేపు టీడీపీ, జనసేన కౌన్సిల్ సభ్యులతో ఎమ్మెల్యే జయకృష్ణ సమాలోచన చేశారు. ఇంతలో మల్లీశ్వరి తన నామినేషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించారు. దీంతో ఎన్నికల అధికారి ఎన్నికల ప్రక్రియను వాయిదా వేశారు. మంగళవారం తిరిగి ఈ ప్రక్రియ చేపట్టనున్నట్లు ప్రకటించారు. అయితే ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగుతుందా, లేదా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఇరు పార్టీల నేతలు ఈ ఎన్నికను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. దీంతో ఎవరికి వారు ఎవరు సమాలోచనల్లో మునిగి తేలుతున్నారు.

- ఎన్నిక ప్రక్రియకు ముందు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, కౌన్సిల్ సభ్యులతో గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. కూటమికే చైర్‌పర్సన్ పదవి దక్కేలా చూడాలని పలు సూచనలు చేశారు. అయితే ఎన్నిక ప్రక్రియ వాయిదా అనంతరం నగర పంచాయతీ కార్యాలయం వద్ద కూటమి కౌన్సిలర్లు, ఎమ్మెల్యేతో మంత్రి చర్చించారు. 4న జరగనున్న ప్రక్రియపై దిశా నిర్దేశం చేశారు.



ఎన్నిక ప్రక్రియ నిర్వహిస్తున్న దృశ్యం


ప్రత్యేక బందోబస్తు...

పాలకొండ చైర్‌పర్సన్ ఎన్నిక నేపథ్యంలో కమిషనర్ సర్వేశ్వరరావు, పాలకొండ సీఐ చంద్రమౌళి ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. నగర పంచాయతీ కార్యాలయం వద్ద మూడు గేట్ల వద్ద మూడంచెల భద్రత నిర్వహించారు. కౌన్సిల్ సభ్యులు, మీడియాను మాత్రమే అనుమతించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

వ్యాజ్యంపై విచారణ నేటికి వాయిదా

పాలకొండ చైర్‌పర్సన్ ఎన్నిక కోసం ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్ సవాల్ చేస్తూ ఎం.స్వర్ణకుమారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 19వ వార్డుకు ఉప ఎన్నిక నిర్వహించే వరకు ఎన్నిక జరపకుండా నిలువరించాలని కోరారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... చైర్‌పర్సన్ పదవి ఎస్టీలకు రిజర్వ్ చేశారన్నారు. 19వ వార్డుకు ఉప ఎన్నిక నిర్వహిస్తే పిటిషనర్ చైర్ పర్సన్‌గా ఎన్నికయ్యే అవకాశం ఉందన్నారు. ఈ దశలో న్యాయస్థానం జోక్యం చేసుకుంటూ చైర్ పర్సన్ పదవిని ఎస్టీలకు రిజర్వ్ చేసినట్లు ఏమైనా వివరాలు ఉన్నాయా? అని ప్రశ్నించింది. ఆ పదవిని ఎస్టీలకు రిజర్వ్ చేస్తూ ఇచ్చిన నోటిఫికేషన్‌ను కోర్టు ముందు ఉంచేందుకు సమయం ఇవ్వాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరారు. అందుకు అంగీకరించిన హైకోర్టు న్యాయూర్తి జస్టిస్ వడ్డిబోయిన సుజాత వ్యాజ్యం పై విచారణను నేటికి వాయిదా వేశారు.

అప్రమత్తతే ఔషధం



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కేన్సర్ వ్యాధి నివారణ కేంద్రం



- అవగాహనతోనే కేన్సర్ నివారణ
- జిల్లాలో పెరుగుతున్న బాధితులు
- సకాలంలో చికిత్స పొందితే మేలు
- ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కేన్సర్ పరీక్షలు
- నేడు ప్రపంచ కేన్సర్ దినం


కేన్సర్... ఈ పేరు వింటేనే ఏదో తెలియని భయం. దీనికి ప్రధాన కారణం ఈ వ్యాధి సోకిన వారిలో మరణాల శాతం ఎక్కువగా ఉండడమే. ఉమ్మడి జిల్లాలో గత కొంతకాలంగా కేన్సర్ బాధితులు పెరుగుతున్నారు. మన శరీరంలోని వివిధ భాగాలకు సోకే కేన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే...సకాలంలో వైద్య సేవలు పొందితే ప్రమాదకరం కాదని వైద్యులు చెబుతున్నారు.

(విజయనగరం రింగురోడ్డు)

జీవన శైలి... ఆహారపు అలవాట్లలో మార్పులు... కాలుష్యం తదితర కారణాలతో కేన్సర్ రోజు రోజుకూ విస్తరిస్తోంది. గతంతో పోల్చుకుంటే జిల్లాలోనూ కేన్సర్ కేసులు పెరుగుతుండడం ఆందోళన కలిగించే విషయం. జన్యుపరమైన కారణాలతో కూడా కేన్సర్ బారిన పడుతున్నారు. జిల్లాలో నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్ బాధితులు ఎక్కువగా ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ప్రధానంగా పొగాకు సంబంధిత వస్తువుల వినియోగం వల్ల అధిక శాతం నోటి కేన్సర్ బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఆసుపత్రిలో కేన్సర్ వ్యాధి నిర్ధారణ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా మేల్కొని సకాలంలో చికిత్స పొందితే.. ఈ వ్యాధి ప్రాణాంతకం కాదని వైద్యులు సూచిస్తున్నారు.

అవగాహన లేనందునే...

కేన్సర్ శరీరంలోకి ప్రవేశించినా చాలా మందికి తెలియడం లేదు. సకాలంలో గుర్తించడం లేదు. వ్యాధిపై అవగాహన లేక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఏ మాత్రం అనుమానం కలిగినా, పరీక్ష చేయించుకుంటే తొందరగా ఈ వ్యాధి నుంచి కోలుకోవచ్చునని వైద్యులు చెబుతున్నారు.



జిల్లాలో పరిస్థితి ఇలా...

ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తోంది. జిల్లాలో గడిచిన రెండు నెలల్లో 60 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో నలుగురికి వ్యాధి ఉన్నట్టు గుర్తించారు. ప్రధానంగా గర్భాశయ, నోటి కేన్సర్‌కి గురవుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. జిల్లాలో 2023లో 274 మంది నోటి కేన్సర్ బారిన పడ్డారు. రొమ్ము కేన్సర్‌తో 153 మంది, గర్భాశయ కేన్సర్‌తో 171 మంది చికిత్స పొందుతున్నారు. 2024 డిసెంబరులో 323 మంది నోటి కేన్సర్ బారిన పడినట్టు తేలింది. రొమ్ము కేన్సర్‌తో 233, గర్భాశయ కేన్సర్‌తో 216 మంది చికిత్స పొందుతున్నట్టు వైద్యులు తెలిపారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కేన్సర్‌కు కొన్ని రకాల పరీక్షలు, ఔషధాలను అందజేస్తున్నారు. అక్కడ పాప్‌స్మియర్, బైయాప్సీ, ఎఫ్‌ఎన్‌ఏసీ పరీక్షలను నిర్వహిస్తున్నారు. విభిన్న వ్యక్తులతో శృంగారంలో పాల్గొనడం వల్ల గర్భాశయ ముఖద్వార కేన్సర్ వస్తుందని వైద్యులు చెబుతున్నారు. హ్యూమన్ పాపిలోమా వైరస్ వల్ల గర్భాశయ కేన్సర్ వస్తుంది. రొమ్ము కేన్సర్ ప్రధానంగా జన్యుపరంగా సంక్రమించే అవకాశం ఉంది. మితిమీరిన మద్యపానం, ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్ వల్ల లివర్ కేన్సర్ బారిన పడే అవకాశం ఉందని, పొగాకు సంబంధిత ఉత్పత్తుల వినియోగం వల్ల నోరు, ఊపిరితిత్తుల కేన్సర్‌కు గురవుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

నివారణ మన చేతుల్లోనే..



ప్రతి ఒక్కరూ 40 ఏళ్ల దాటిన తరువాత ఏడాదికి ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ముఖ్యంగా అధిక బరువు వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువ. మత్తుపదార్థాల వినియోగం వల్ల నోరు, ఊపిరితిత్తులు క్యాన్సర్ సోకుతుంది. వీటి వినియోగాన్ని ఆపివేయాలి. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలి. 40 ఏళ్ల దాటిన మహిళలు ప్రధానంగా మమోగ్రఫీ పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్‌ని నిర్ధారించవచ్చును. 11 నుంచి 14 ఏళ్ల బాలికలకు హెచ్‌పీసీవీ వ్యాక్సిన్ వేసుకోవడం ద్వారా గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌ను నివారించవచ్చును. ఏ అనారోగ్య లక్షణమైనా మూడు వారాలకు మించి తగ్గకపోతే, ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. ఎంత త్వరగా గుర్తిస్తే అంత త్వరగా క్యాన్సర్‌కు చికిత్స సులభతరమవుతుంది.

- డాక్టర్ పి.విజయలక్ష్మి, మెడికల్ అంకాలజిస్ట్

ఓం నమో సూర్యాయ

- అరసవల్లిలో అర్ధరాత్రి ఆరంభమైన క్షీరాభిషేకం
- రథసప్తమి వేడుకలకు భారీగా భక్తుల రాక
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


తులసి కోటకు భక్తుల పూజలు

శ్రీకాకుళం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షదైవం.. అరసవల్లిలోని శ్రీ సూర్య నారాయణ స్వామి రథసప్తమి వేడుకలు ఉత్సాహంగా సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం 'రథసప్తమి'ని రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో ఈసారి ప్రత్యేకత సంత రించుకుంది. ఆదివారం నుంచి ఈ ప్రారంభమైన ఈ వేడుకలు.. సోమవారం కూడా కొనసాగాయి. రాష్ట్రస్థాయి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు ఆకట్టుకున్నాయి. సోమవారం అర్ధరాత్రి నుంచి కీలకఘట్టం.. ఆదిత్యుడికి క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. దేవదాయశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి వినయ్‌చంద్ పట్టువస్త్రాలను స్వామికి సమర్పిం చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని.. సూర్య మంత్రాన్ని స్మరించారు. ఆలయ ఆవరణ అంతటా 'ఓం నమో భగవతే సూర్యాయ' నామస్మరణ మార్మోగింది. ఓ వైపు దట్టంగా పొగమంచు కురుస్తున్నా.. అధిక సంఖ్యలో భక్తులు సోమవారం రాత్రి ఆలయానికి చేరుకున్నారు. రాత్రి 11 గంటల నుంచే క్యూలో బారులుదీరారు. దాతలు, ప్రముఖుల స్వామిని దర్శించుకున్నారు.


ఆలయ అనివెట్టి మండపంలో అలంకరణ


భద్రతా ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్, ఎస్పీ

అంతటా నిఘా

ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో 3వేల మంది పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. డ్రోన్లతో నిఘా వ్యవస్థను పరిశీలించేందుకు.. సత్వరమే చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక బలగాలను సిద్ధం చేశారు. దీంతోపాటు ఉచిత వైద్యశిబిరాలు, అలాగే సత్యసాయి, ఇతర కుల సంఘాలు.. కార్పొరేట్ సంస్థలకు చెందిన అన్న ప్రసాద వితరణ స్టాల్స్ వెలిశాయి. ఇదిలా ఉండగా పర్యాటకుల తాకిడి పెరగడంతో హెలీటూరిజంను మరో రెండు రోజుల వరకు పెంచారు.

దర్శించుకున్న మంత్రులు

ఆదిత్యుడ్ని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు గొండు శంకర్, గౌతు శిరీష, బగ్గు రమణమూర్తి, కూన రవికుమార్, నడుకుదిటి ఈశ్వరరావు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవి, వరుదు కల్యాణి, మాజీమంత్రి గుండ అప్పలసూర్య నారాయణ, మాజీఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయా సాయిరాజ్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి తదితరులు దర్శించుకున్నారు.

నేడు నిజరూప దర్శనం

మంగళవారం ఉదయం నుంచి ఆదిత్యుడు నిజరూపంలో భక్తులకు దర్శనమిస్తారు. సాయంత్రం విశేష పుష్పాలంకరణ సేవ ఉంటుంది. నిజరూప దర్శనానికి భక్తులు భారీగా తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసింది. ఆలయం వద్ద ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా ఆలయం వెనుక భాగం నుంచి వాహనాలు వచ్చేలా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఏర్పాట్లను ఎప్పటికప్పుడు కేంద్ర,రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ పర్యవేక్షిస్తున్నారు.


విద్యుత్ వెలుగుల్లో అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయ ముఖద్వారం, పరిసరాలు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో 'విజయ'నగరం

- ద్వితీయ స్థానంలో శ్రీకాకుళం
- హోరాహోరీగా రథసప్తమి క్రీడోత్సవాలు



విజయనగరం జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏడు రోడ్ల కూడలిలో గల ఎన్టీఆర్ మున్సిపల్ మైదానంలో గత రెండు రోజులుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో విజయనగరం జట్టు విజేతగా నిలిచింది. రథసప్తమి వేడుకల్లో భాగంగా ఈ పోటీలు నిర్వ హించారు. సోమవారం నిర్వహించిన ఫైనల్స్‌లో తొలి సెట్‌లో శ్రీకాకుళం జట్టు 23-25 స్కోర్‌తో ముందంజ వేయగా.. తర్వాత రెండు సెట్స్‌లో 25-16, 15-10 స్కోర్‌తో వెనకబడింది. దీంతో విజయనగరం జట్టు విజేతగా నిలిచింది. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో ఈ పోటీలు నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌ను ఎమ్మెల్యే గొండు శంకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తిలకించారు. దీంతో పాటు గ్రామీణ క్రీడలైన వెయిట్ లిఫ్టింగ్, కర్ర సాము, ఇసురు గుండు, పిల్లి మొగ్గలు, 160 కేజీల ఉలవల బస్తా, ఈడుపు సంగిడీ, తీట సంగిడీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. క్రీడాకారులందరికీ నగదుతో పాటు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్, జిల్లా ఒలింపిక్ సంఘం ముఖ్య సలహాదారు పి.సుందరరావు, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా పీఈటీ, పీడీల సంఘ అధ్యక్షుడు ఎంవీ రమణ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, శిక్షకులు హరికృష్ణ, ఎం.మాధురీలత, అర్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శ్రీకాకుళం, విజయనగరం జట్ల మధ్య పోటీ

శ్యామలాంబ ఘటాలకు తొలిపూజ

- పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రజలు
- సంప్రదాయబద్ధంగా హారతులు


ఘటానికి మొక్కుతున్న రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సుమారు 14 ఏళ్ల తరువాత సాలూరు శ్యామలాంబ అమ్మవారి పండుగ సందడి మొదలైంది. స్థానిక జన్ని వీధిలో ఉన్న గద్దె వద్ద అమ్మవారి ఘటాలకు రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సోమవారం పూజలు నిర్వహించారు. హారతులు ఇచ్చి గద్దె తలుపులు తీయగా... ఆలయ అనువంశిక ధర్మకర్త విక్రంచంద్ర సన్యాసిరాజు (యువ రాజు) ఘటాలకు తొలిపూజ చేశారు. అనంతరం మంత్రి సంధ్యారాణి ఘటాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు హారతులిచ్చారు. అమ్మవారి ఘటాలను జన్ని వీధి, బోను మహంతి వీధి, కర్రి వీధి తదితర ప్రాంతాల్లో ఊరేగించారు. సుదీర్ఘ విరామం తరువాత నిర్వహిస్తున్న శ్యామలాంబ పండుగ, అమ్మవారి ఘటాల పూజల్లో పట్టణ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మేళతాళాలు, మహిళల జయ జయ ధ్వానాల నడుమ ఘటాలు గద్దెకు చేరుకున్నాయి. మంగళవారం పాల జంగిండి, ఘటాల ఊరేగింపు ఉంటుంది. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అక్కేన అప్పారావు, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్, నిమ్మాది తిరుపతిరావు, కేతిరెడ్డి చంద్రశేఖర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.


ఘటాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

అక్షర 'వసంతం'

- ఘనంగా వసంత పంచమి
- జిల్లా వ్యాప్తంగా అక్షరాభ్యాసాలు


గరుగుబిల్లి: రావివలసలో అక్షరాభ్యాసాలు


బొబ్బిలి/రూరల్: అలజంగి సీబీఎం పాఠశాలలో


నెల్లిమర్ల: కొండగుంపాం ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు

వసంత పంచమి సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గల ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. సరస్వతీ దేవి ఆలయాలు... ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. - ఆంధ్రజ్యోతి బృందం

నేడు శంబర మారువారం జాతర



మక్కువ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం.. భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి శంబర పోలమాంబ మారువారం జాతర మంగళవారం జరగనుంది. ఈ మేరకు దేవదాయ శాఖాధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు తరలిరానున్నారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. చేశారు. అమ్మవారి దర్శనం త్వరగా అయ్యేలా చర్యలు చేపట్టారు. మరోవైపు 20 వేల లడ్డూ ప్రసాదం సిద్ధ చేసినట్టు ఈవో వీవీ సూర్యనాయరాణ తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సాలూరు రూరల్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో 150 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడంతో పాటు అందుబాటులో అంబులెన్స్‌లు ఉంచుతున్నట్లు వెల్లడించారు.

ఉప్పు గెడ్డ రోడ్డు నిర్మాణం ఇంకెప్పుడో?

రోడ్డును తవ్వి వదిలేయడంతో స్థానికులకు ఇబ్బందులు



శిథిలమైన ఉప్పుగెడ్డ వంతెన

భోగాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్టసబ్బన్నపేట, సబ్బన్నపేట గ్రామాల మధ్యలో ఉప్పుగెడ్డపై వంతెన నిర్మాణం కలగానే మిగిలింది. దీంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడంలేదు. గత వైసీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణం అదిగో ఇదిగో ప్రజలను నమ్మించింది. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం రూ.2 కోట్లతో 1.6 కిలోమీటర్ల పొడవున బీటీ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. దీంతో రహదారి సమస్య తీరుతుందని ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. అయితే పనులు చేసేందుకు ఉప్పుగెడ్డ సమీపంలో దాదాపు ఆరు వారాల కిందట రోడ్డును తవ్వి వదిలేశారు. దీంతో నందిగాం, సబ్బన్నపేట, మాల నందిగాం, ఆవాలనందిగాం, మెట్టసబ్బన్నపేట గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి సమస్యను పరిష్కరించాల్సి ఉంది. దీనిపై పీఐయూ జేఈ వెంకటేశ్ వివరణ కోరగా ఉప్పుగెడ్డ సమీపంలో మరో రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.



వంతెన సమీపంలో తవ్వి వదిలేసిన దృశ్యం

అభివృద్ధి పనుల పరిశీలన

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది సోమవారం పరిశీలించారు. 56వ సచివాలయ పరిధిలోని తుమ్మగుంటివారి వీధిలో తాగునీరు వృథాగా పోతుందని గుర్తించి దాన్ని సరిచేయించారు. రాజీవ్ నగర్ ప్రాంతంలో హెచ్‌డీఈపీ ఇంటర్ కనెక్షన్ పైపులైన్ల మరమ్మతులు చేపట్టారు. ఈఈ టి.రాయల్‌బాబు, ప్రొఫెసర్ మల్లేశ్వరరావుతో కూడిన బృందం ముందుగా ఎల్ఐసీ భవనం వద్ద కాలువ, ఆ తర్వాత ఫోర్ ఎస్ డిగ్రీ కళాశాల ప్రాంతంలోని కాలువ, ధర్మపురిలోని ప్రధాన రహదారి కాలువలను పరిశీలించారు. అలాగే గాజులరేగలోని గుబేల్ పేట ప్రాంతంలో పాత పైప్‌లైన్ నుంచి కొత్త పైప్ లైన్‌ద్వారా కొళాయి కనెక్షన్ ఏర్పాటు చేశారు. అనంతరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించారు.

అంచనాల కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్సీ సురేష్‌బాబు



నెల్లిమర్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ అంచనాల కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు (సురేష్‌బాబు)నియమితులయ్యారు. ఈమేరకు అసెంబ్లీ కార్యదర్శి ప్రసన్నకుమార్ సూర్యదేవర ఉత్తర్వులు జారీ చేశారు. అంచనాల కమిటీలో చైర్మన్‌తో పాటు 11 మంది సభ్యులు ఉంటారు. చైర్మన్‌గా వి.జోగేశ్వరరావును నియమితులయ్యారు. కమిటీలో ముగ్గురు ఎమ్మెల్సీలు, 9 మంది ఎమ్మెల్యేలను నియమించారు. అంచనాల కమిటీలో డాక్టర్ సురేష్‌బాబుకు చోటు దక్కడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

కల్వర్టు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ ఇందుకూరి

శృంగవరపుకోట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) శృంగవరపుకోట పుణ్యగిరి రోడ్డులోని కల్వర్టు పనులను సోమవారం సర్పంచ్ గనివాడ సంతోషికుమారితో కలిసి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పరిశీలించారు. కల్వర్టు శిథిలావస్థకు చేరుకోవడంతో ఉపాధి నిధులను కేటాయించారు. దీంతో పనులు చురుగ్గా జరుగుతున్నాయి పుణ్యగిరి మహా శివరాత్రి జాతర సమయానికి పనులు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.

సోమశేఖర్‌కు నంది పురస్కారం



అవార్డు అందుకుంటున్న సోమశేఖర్

గరివిడి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గరివిడికి చెందిన జమ్ము సోమశేఖర్‌కు తెలుగు వెలుగు నంది పురస్కారం లభించింది. విజయవాడలో ఇటీవల జరిగిన తెలుగు, వెలుగు సాహితీ వేదిక స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా తుమ్మలపల్లి కళా క్షేత్రంలో అవార్డును సోమశేఖర్‌కు ప్రదానం చేశారు. ఆర్టిస్టు, మిమిక్రీ కళాకారుడిగా రాణిస్తున్న సోమశేఖర్‌కు అవార్డు దక్కడంపై పలువురు అభినందించారు.

జామి ఎల్లారమ్మ జాతరకు నేడు ముహూర్తం

జామి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉత్తరాంధ్రుల ఇలవేల్పు ఎల్లారమ్మ జాతరకు మంగళవారం ఉదయం గ్రామపెద్దలు, యువత ఆధ్వర్యంలో ముహూర్తం ఖరారు చేయనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. పంచాయతీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువత హాజరుకావాలని కోరారు.

పేదలకు నిత్యావసరాలు

జామి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజినిగిరిలో హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు గ్రామంలోని పేదలకు నెలరోజులకు సరిపడే నిత్యావసరాలను సోమవారం రాత్రి అందించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సన్యాసినాయుడు, మిడతాన తాతంనాయుడు, శ్రీనివాసరావు తదితరులున్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మెంటాడ మండలం గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గిరిజనులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఇంటింటికీ నీటి సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలోని ఆదివాసి గిరిజన నాయకులు పాల్గొన్నారు.

కలిశెట్టికి చంద్రబాబు అభినందనలు



కలిశెట్టిని అభినందిస్తున్న చంద్రబాబు

విజయనగరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. ఆయన సామాజిక స్పృహ, పార్టీపై ఉన్న విధేయతను కొనియాడారు. ఢిల్లీలో నానాటికీ ప్రమాద భరితంగా మారుతున్న కాలుష్య నియంత్రణకు పర్యావరణ పరి రక్షణలో భాగంగా వ్యక్తిగత సామాజిక బాధ్యతతో టీడీపీ అధికారిక సింబల్ సైకిల్‌ను ఎంపిక చేసుకున్నారు. సైకిల్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు తన సహాయకుల ద్వారా ఎంపీ కలిశెట్టిని పిలిపించి ఆయనను అభినందించారు.

రైల్వే బడ్జెట్‌పై ఎమ్మెల్యే హర్షం



ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రైల్వే బడ్జెట్‌లో రాష్ట్రానికి రికార్డు స్థాయిలో నిధులు కేటాయించడంపై కేంద్రప్రభుత్వానికి ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆమె కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రైల్వే బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేశారు. 73 స్టేషన్ల రూపురేఖలు మారనున్నాయన్నారు. 16 జిల్లాల మీదుగా వందేభారత్ రైళ్లు ప్రయాణిస్తున్నాయని, వాటి సంఖ్య మరింత పెరగనుందని పేర్కొన్నారు. చంద్రబాబు మార్కుతో రాష్ట్రానివృద్ధి పరుగులు పెడుతోందని లలితకుమారి అభిప్రాయపడ్డారు.

కళాను పరామర్శించిన మంత్రులు



కళాతో మాట్లాడుతున్న మంత్రులు సంధ్యారాణి, శ్రీనివాస్

రాజాం/ రేగిడి ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు సోదరుడు కిమిడి సత్యనారాయణ నాయుడు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో రాష్ట్ర మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్ ఆయన్ని పరామర్శించారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయానికి వెళ్లి మృతి చెందడానికి గల కారణాలను అడిగి తెలుసుకుని సంతాపం తెలిపారు. అనంతరం స్వగ్రామం రేగిడి చేరుకుని సత్యనారాయణనాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కిమిడి గణపతిరావు ఉన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి

గజపతినగరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక దిగువ వీధిలో కొలువైన పైడితల్లి అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దర్శించుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పి.వి.వి.గోపాలరాజు, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్, సర్పంచ్ నరవ కొండమ్మ, కందుల చిన్నయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

320 మందికి అక్షరాభ్యాసాలు

రాజాం రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని జ్ఞాన సరస్వతి దేవస్థానంలో సోమవారం 320 మంది చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. ఆలయ ప్రధాన అర్చకులు రామచంద్రశర్మ సారథ్యంలో కార్యక్రమం జరిగింది. దేవస్థానం ఈవో పొన్నాడ శ్యామలరావు, గురుభవానీ కూరాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

●గుర్ల:వసంత పంచమి సందర్భంగా మండలంలోని పాలవలస పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు ఎన్.సూర్యనారాయణ, ఎ.సురేష్‌కుమార్, సీహెచ్. రామ్ కుమార్ ఎస్ఎంసీ చైర్మన్ ముద్దాడ నారాయణ పాల్గొన్నారు.

●బొండపల్లి: మండలంలోని కొత్త పనసలపాడు ప్రాథమిక పాఠశాలలో విజయనగరంలో శారదాపీఠం అందజేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని సోమవారం ఎంఈవో-2 అల్లు వెంకటరమణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం పూడి మహేష్ పాల్గొన్నారు.

●వంగర : మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో సర్వతీదేవి విగ్రహానికి విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రిన్సిపాల్ రవిశంకర్, వైస్ ప్రిన్సిపాల్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎస్ ఫిట్‌నెస్ విధానం రద్దు చేయండి

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటీఎస్ ద్వారా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేసే విధానాన్ని రద్దు చేయాలని విజయదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నీలాపు అప్పలరాజు రెడ్డి, రెడ్డి నారాయణరావుడిమాండ్ చేశారు. ఏటీఎస్ ఫిట్‌నెస్ విధానం రద్దు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాపిడో బైక్స్, ఓలా, ఓబర్ వంటి కంపెనీలకు జిల్లాల్లో లైసెన్స్ ఇచ్చే విధానాన్ని విరమించుకోవాలన్నారు.

కుష్టు వ్యాధి బాధితులకు రూ.10 వేలు

నెల్లిమర్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధిగ్రస్థులకు ప్రత్యేక పాదరక్షల నిమిత్తం వైసీపీ నాయకుడు బొత్స లక్ష్మణరావు కుమారుడు చైతన్యబాబు రూ.10 వేలు వితరణ చేశారని లెప్రో సొసైటీ రిసోర్స్ ఎగ్జిక్యూటివ్ లెంక రమణ తెలిపారు. చైతన్య జన్మదిన వేడుకలను పురస్కరించుకుని వైసీపీ నాయకుడు పతివాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో విరాళం అందజేశారన్నారు.

అశోక్, అదితిని కలిసిన రాజేశ్‌వర్మ



అశోక్ గజపతిరాజును సత్కరిస్తున్న దృశ్యం

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజులను బంగ్లాలో సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేశ్‌వర్మ మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఆయనతో పాటు బీజేపీ నాయకులు సుధీర్, అప్పారావు దొర, సీతారామ్, మజ్జి రమేష్, ఏబీవీపీ రమణ, మహేష్, నీలాపు దేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి రైతులకు 'కూటమి' చేయూత



గౌరీశ్వరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే

రాజాం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రకృతి సాగు చేపట్టే రైతులకు కూటమి ప్రభుత్వం చేయూత అందిస్తోందని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. సోమవారం రాజాంలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరయ్యారు. జాతీయ రైతు నేస్తం పురస్కార గ్రహీత, ప్రకృతి సాగు రైతు పెంకి గౌరీశ్వరరావును ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సాగులో ఆరోగ్యకరమైన ఆహారంపై అందరికీ అవగాహన కల్పించాలని గౌరీశ్వరరావుకు సూచించారు. దానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో ప్రకృతి రైతులు అప్పలనాయుడు, పి.శ్రీనాథ్, ఎ.అరుణ్‌కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఆర్‌వీజే నాయుడు, యందవ సూరిబాబు పాల్గొన్నారు.

ప్రయాణికుడికి బ్యాగ్ అందజేత

శృంగవరపుకోట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో వదిలేసిన బ్యాగ్‌ను అధికారులు సదరు ప్రయాణికుడికి అందజేశారు. సోమవారం ఓ బస్సులో ప్రయాణికుడు తన బ్యాగ్‌ను మరిచిపోయాడు. ఈ విషయాన్ని డిపో అధికారులకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో అధికారులు ప్రయాణించిన బస్సు వివరాలను తెలుసుకున్నారు. బస్సులోని బ్యాగ్‌ను డిపోకు తీసుకువచ్చి ప్రయాణికుడికి అందజేశారు.

పశు వైద్య విద్యార్థుల ఆందోళన

గరివిడి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గరివిడిలోని పశువైద్య కళాశాల విద్యార్థులు మరోసారి తరగతులు బహిష్కరించి సోమవారం కళాశాల ప్రాంగణంలో ఆందోళనకు దిగారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి అనుమతులు ఇవ్వాలని, స్టైఫండ్ పెంచాలని, తమ సర్టిఫికెట్లకు పీజీ అనుమతి ఇవ్వాలని కోరారు. కళాశాలలో పూర్తిస్థాయి అధ్యాపకులను నియమించాలని, అసంపూర్తిగా ఉన్న తరగతి గదులను వేగంగా పూర్తిచేయాలని తదితర డిమాండ్లు కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. సమస్యపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పరిష్కరించకుండా తమ ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం



విగ్రహ ప్రతిష్ఠోత్సవంలో భక్తులు

సంతకవిటి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందపురంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మూడు రోజులుగా జరుగుతున్న రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవం తుది దశకు చేరుకుంది. సోమవారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలతో తిరువీధి ఉత్సవం చేపట్టారు.

సాగు భూములకు హక్కు కల్పించండి

కొత్తవలస, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రామలింగపురం రెవెన్యూలో 40 ఏళ్ల గా సాగు చేస్తున్న భూములకు హక్కు కల్పించాలని రామలింగపురం, చీడివలస, అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం శృంగవరం గ్రామాలకు చెందిన రైతులు కొత్తవలస తహసీల్దార్ బి.నీలకంఠారావును కోరారు. సోమవారం ఉదయం మూడు గ్రామాల రైతులు వినతిపత్రం అందజేశారు.

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం నిరసన

శృంగవరపుకోట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట సోమవారం కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సీపీఎం నిరసన తెలిపింది. సామాన్య, కార్మిక, కర్షక వర్గాలకు ప్రయోజనం లేని బడ్జెట్‌ను ఆర్థికశాఖ మంత్రి ప్రవేశపెట్టారని సీపీఎం నాయకుడు మద్దిల రమణ విమర్శించారు. కార్యక్రమంలో కె.రమేష్, ఎం.రాజు, చరణ్, లక్ష్మి తదితరులున్నారు.

పాల రైతులు నష్టపోకుండా చూడండి

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ సేకరణ కేంద్రాల్లో పాలు పోస్తున్న రైతులు నష్టపోకుండా చూడాలని పాల రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద పాల రైతు సంఘం అధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలోని పాల రైతు సంఘ నాయకులు బి.రాంబాబు, ఆదినారాయణ, గొంప కృష్ణ తదితరులు ఉన్నారు.

ఆర్డీవో ఆదేశాలు బేఖాతర్

● అక్రమ నిర్మాణం కూల్చివేతపై దృష్టి పెట్టని అధికారులు

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిల్తంపాలెం పంచాయతీలోని డీ పట్టా భూమిలో అక్రమంగా నిర్మించిన రిసార్ట్‌ను కూల్చివేయాలనే ఆర్డీవో ఆదేశాలను అధికారులు బేఖాతర్ చేశారు. రిసార్టును డీ పట్టాలో నిర్మించారని 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురిత కథనాలకు గతంలో ఆర్డీవో స్పందించారు. అప్పట్లో ఆర్డీవో భవానీశంకర్. తహసీల్దార్ నుంచి నివేదిక తెప్పించుకున్నారు. నోటీసులు జారీ చేసి అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేయాలని రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. అందుకు తగ్గట్టు సదరు వ్యక్తికి 6-ఎ, 7-ఎ నోటీసులు జారీ చేశారు. ఇక భవనాన్ని కూల్చేస్తారని అంతా భావించారు. అయితే అందుకు భిన్నంగా వ్యవహారం సాగింది. అప్పట్లో అధికారంలోని వైసీపీ ఎమ్మెల్యేను సదరు వ్యక్తి ఆశ్రయించారు. దీంతో అధికారుల నోటీసులకు పత్తా లేకుండా పోయింది. గత ప్రభుత్వ హయాంలో 2022 ఏప్రిల్‌లో ఈ తతంగం జరిగింది. నాటి నుంచి నేటివరకూ ఆ భవనం వైపు రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. ఈ విషయంపై తహసీల్దార్ అరుణకుమారి వివరణ కోరగా డిప్యూటీ తహసీల్దార్‌ను పంపించి విచారణ చేస్తామన్నారు.



రిసార్టును పరిశీలిస్తున్న ఆర్డీవో భవానీశంకర్ (ఫైల్ ఫొటో)

డీ పట్టా భూములు దుర్వినియోగం



పేదలకు ఇచ్చిన డీ పట్టా భూముల్లో కొందరు పక్కా నిర్మాణాలు చేపడుతున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం. జామిలోనూ డీ పట్టాలో నిర్మాణాలు వెలిశాయి. చెరువులను కూడా ఆక్రమిం చేశారు. ఈ విషయం మండల, జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశాం. చ ర్యలు తీసుకోకపోతే సీఎం, డిప్యూటీ సీఎంలకు ఫిర్యాదు చేస్తా.

-కొత్తలి గౌరినాయుడు, మానవ హక్కుల సంఘం, జిల్లా ప్రతినిధి

క్రైం న్యూస్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పాచిపెంట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కర్రివలసలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం గొల్లలపేటకు చెందిన కుంబంగి రామారావు గత కొన్ని రోజులుగా కర్రివలసలో షెడ్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఆదివారం కూడా పనుల్లో భాగంగా ఇనుప పైపు పైకి ఎక్కిస్తుండగా పైన గల విద్యుత్ వైరుకు తగిలి షాక్‌కు గురయ్యాడు. వెంటనే సాలూరు పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ పి.కృపారావు తెలిపారు.

కారు ఢీకొని..

కొత్తూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదం పిసినికాడ గ్రామ జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. దీనికి సంబంధించి అనకాపల్లి రూరల్ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. విజయనగరం జిల్లాకు చెందిన షేక్ బాబ్జీ(30) నాలుగేళ్ల క్రితం అనకాపల్లికి వలస వచ్చాడు. అప్పటి నుంచి రోజూ ఉదయం ప్లాస్టిక్ డబ్బాలు సేకరించి పాత సామగ్రి కొనుగోలుదారునికి విక్రయిస్తున్నాడు. రాత్రి వేళ గ్రామ సమీపంలో ఉన్న ఒక దాబాలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 10 గంటల సమయంలో అతను దాబా నుంచి రోడ్డు దాటుతుండగా కశింకోట నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతనిని అనకాపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతను అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, అతని సంబంధీకులు అనకాపల్లి రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ ఫోన్ నంబరు 9440796085ను సంప్రదించాలని హెడ్ కానిస్టేబుల్ కోరారు.

అదృశ్యమైన విద్యార్థి: తల్లిదండ్రులకు అప్పగింత

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విజయనగరం మండలం కోరుకొండ సైనిక స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి అదృశ్యమైన నేపథ్యంలో విజయనగరం రూరల్ పోలీసులు ఆ విద్యార్థి ఆచూకీ తెలుసుకోవడంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. సదరు విద్యార్థిని ఆగర్తాలాలో ఉన్నట్టు తెలుసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం సదరు విద్యార్థిని తల్లిదండ్రులకు అప్పగించినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సైనిక స్కూల్‌కు చెందిన విద్యార్థి అదృశ్యమయ్యాడని సైనిక స్కూల్ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయనగరం రూరల్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. జనవరి 19న సదరు విద్యార్థి సంక్రాంతి సెలవు అనంతరం స్కూల్‌కు చేరుకోవాల్సి ఉంది. స్కూల్ నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడంతో తండ్రి మోహన్ ఫోన్ చేసి ఆరా తీశారు. విద్యార్థి స్కూల్‌కు చేరలేదని సిబ్బంది బదులివ్వడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, స్థానిక పోలీసుల అప్రమత్తమయ్యారు. అన్ని విభాగాలకు వివరాలు పంపి పర్యవేక్షించారు. దాంతో ఆగర్తాలా రైల్వే పోలీసులకు విద్యార్థి ఆచూకీ లభ్యమైంది. వారు విజయనగరం రూరల్ పోలీసులక అప్పగించారు. కేసులో క్రియాశీలకంగా వ్యవహరించిన రూరల్ ఎస్ఐ అశోక్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

పీడీఎస్ బియ్యం వేలం

గజపతినగరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఎల్ ఎస్ పాయింట్ ఆవరణలో సోమవారం పీడీఎస్ బియ్యం వేలం పాట నిర్వహించినట్టు తహసీల్దార్ బి.రత్నకుమార్ తెలిపారు. మండలంలో ఇటీవల పట్టుబడిన 55.339 మెట్రిక్ టన్నుల బియ్యంను జేసీ ఆదేశాల మేరకు వేలం వేశామన్నారు. ప్రభుత్వం ధర కిలో రూ.20 నుంచి ప్రారంభించగా జామి మండలం తాన్నవరం గ్రామానికి చెందిన కుసుమంచి తాతాజీ రూ.27కు బియ్యాన్ని దక్కించుకున్నారన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ తిరుపతిరావు పాల్గొన్నారు.

●చీపురుపల్లి: చీపురుపల్లి ఎల్‌ఎల్‌ఎస్ పాయింట్ పరిధిలో పలు సందర్భాల్లో పట్టుబడిన 525.98 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సోమవారం వేలం వేశారు. స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద నిర్వహించిన వేలం పాట లో 12 మంది పాల్గొన్నారు. నర్సీపట్నానికి చెందిన నడుగట్ల శ్రీనివాసరావు కిలో బియ్యం రూ.25 చొప్పున పాటతో కైవసం చేసుకున్నారు. వేలంలో చీపురుపల్లి తహసీల్దారు ఎన్.రాజారావు, సీఎస్‌డీటీ నాగలక్ష్మితో పాటు గరివిడి, రాజాం, నెల్లిమర్ల డీటీలు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే కేసులు



ఆక్రమణదారులతో మాట్లాడుతున్న సీఐ

రాజాం రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఫుట్ పాత్‌లను ఆక్రమించి వ్యాపా రాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం మాధవ బజార్, బజార్ రోడ్ ప్రాంతాలలో ఎస్ఐ రవికిరణ్ సిబ్బందితో కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన బల్లలు, కూరగాయలు, ఇతరత్రా వ్యాపారులకు సంబంధించిన మెటీరియల్‌ను తాత్కాలిక నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగిం చాలని సూచించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వ్యవసాయ కూలీలకు అన్యాయం

కొత్తవలస, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు బడ్జెట్‌లో అన్యాయం చేసిదంటూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిల రమణ ఆరోపించారు. సోమవారం ఉత్తరాపల్లి రెవెన్యూ పరిధిలోని దిబ్బచెరువు, పాత సుంకరపాలెం గ్రామ చెరువు ప్రాంతాల్లో బడ్జెట్ కాపీలను పంపిణీ చేశారు. ఉపాధి హామీ పథకానికి అదనపు కేటాయింపులుగానీ వ్యవసాయరంగ అభివృద్ధి కోసం గానీ బడ్జెట్‌లో ప్రస్తావించలేదన్నారు.

పాఠశాలను విలీనం చేయవద్దు

మెరకముడిదాం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిల్లలవలస ఎస్‌డబ్ల్యూ పాఠశాలను స్థానిక ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయరాదంటూ స్థానికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. దశాబ్దాల కాలంగా ఉన్న పాఠశాలను ఇప్పుడు విలీనం చేయాలని యోచించడం అన్యాయమన్నారు. ఇదిలా ఉండగా ఎస్‌డబ్ల్యూ పాఠశాల్లో ఐదుగురు విద్యార్థులు ఉన్న నేపథ్యంలో నిబంధనలకు లోబడి అదే గ్రామంలో రెగ్యులర్ పాఠశాలలో విలీనం చేపట్టాల్సి ఉందని అధికారులు తెలిపారు.

గుర్లను సందర్శించిన డీఎంహెచ్‌వో

గుర్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుర్ల గ్రామాన్ని డీఎంహెచ్‌వో జీవనరాణి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానికులతో మాట్లాడి విరోచనాలు, వాంతులపై ఆరా తీశారు. అనంతరం గుర్ల పీహెచ్‌సీని పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ హెల్త్ ప్రోగ్రామ్స్ అమలు చేయడంలో సిబ్బంది చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న లెప్రసీ, టీబీ, బోదకాలు, బీపీ, షుగర్, క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్స్‌పై దృష్టిసారించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సర్వే శతశాతం పూర్తి చేయండి

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఎంఎస్ఎంఈ సర్వేను శతశాతం పూర్తి చేయాలని కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో శానిటేషన్, అడ్మిన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, టీపీఆర్‌వో సింహాచలం, ఏవో సీతారామమూర్తి పాల్గొన్నారు.

నేటి నుంచి పైడమ్మ, చిన్నమ్మతల్లి పేరంటాల తీర్థం

వేపాడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాకేరు గ్రామంలో మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు గ్రామ దేవతలు పైడమ్మ, చిన్నమ్మతల్లి పేరంటాలు, వీరాంజనేయస్వామి తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్టు గ్రామ పెద్ద, సర్పంచ్ బుద్ద అప్పలనాయుడు, చిన్నమ్మ దంపతులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, గుర్రాల పరుగు, సంగిడీ రాళ్ళ, బైక్ స్లో రన్ పోటీలు నిర్వహిస్తామన్నారు.

కదలవు.. వదలవు

(ఐదో పేజీ తరువాయి)

దృష్టి సారించాలని అటవీ శాఖాధికారులు చెబుతున్నారు. ప్రధానంగా మిరప, పొగాకు, అల్లం, పసుపు వంటి పంటలు మేలు. దీనివల్ల కొంతవరకు పంటలను రక్షించుకోవచ్చు. ఏనుగులకు నచ్చని పంటలు సాగు చేయడం వల్ల వాటి దాడిని నివారించొచ్చు.

- వాస్తవంగా ఏనుగులకు జ్ఞాపకశక్తి ఎక్కువ. వాటి మార్గాన్ని మరిచిపోవు. మనుషులకు వేగంగా పసిగట్టేస్తాయి. సెల్‌ఫోన్ కెమెరా ఫ్లాష్, టార్చిలైట్ వెలుతురులో అవి చిరాకుపడి దాడి చేస్తుంటాయి. అందుకే గజరాజులు ఎదురుపడినప్పుడు వాటిని వినియోగించకూడదు.
- కందిరీగలు.. తేనె టీగలు అంటే ఏనుగులకు భయం. రైతులు వాటి సౌండ్‌ను రికార్డు చేసి పంట పొలాల్లో ప్లే చేస్తే వాటి నుంచి రక్షణ పొందొచ్చు. కారాన్ని రంపపు పొట్టులో కలిపి పొలాల్లో పెట్టుకుంటే కొంతవరకు దాడిని నివారించొచ్చని అటవీశాఖాధికారులు చెబుతున్నారు.

పొలాలకు వెళ్లలేకపోతున్నాం..

పంట పొలాల్లోనే గజరాజులు సంచరిస్తుండడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు. మొక్కజొన్నకు తడి పెట్టలేకపోతున్నాం. పొలాలకు వెళ్లాలంటేనే భయంగా ఉంది. ఏపక్క నుంచి ఏనుగులు వచ్చి దాడి చేస్తాయో తెలియని పరిస్థితి. దీనిపై అధికారులు స్పందించాలి.

- భూపతి అచ్యుతరావు,రైతు, ఘనసర

పంట రక్షణ ఎలా?

గత నాలుగేళ్లుగా ఈ ప్రాంతంలోనే ఏనుగులు సంచరిస్తున్నాయి. అయితే ఈ ఏడాది అంత ఇబ్బంది ఎప్పుడూ లేదు. మొక్కజొన్న పొలాల్లోనే ఏనుగులు తిష్ఠ వేయంతో పంటను ఎలా రక్షించుకోవాలో తెలియడం లేదు. నాలుగు ఎకరాల్లో సాగు చేస్తే.. ఇప్పటికే 1.50 సెంట్లలో మొక్కజొన్నను ఏనుగులు ధ్వంసం చేశాయి.

- పి.సత్యనారాయణ, రైతు, ఘనసర

చర్యలు తీసుకుంటున్నాం

ఏనుగుల నుంచి ప్రజలు, పంటలను రక్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఈ ప్రాంతంలో గజరాజులను కట్టడి చేసేందుకు ఇప్పటికే ఆరుగురు సిబ్బంది శిక్షణ కోసం కర్ణాటక రాష్ట్రానికి వెళ్లారు. వారు వచ్చిన తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టిసారించడం మేలు.

- కె.మణికంతేషు, రేంజర్, పార్వతీపురం

వ్యతిరేక కథనాలపై స్పందించాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి) : పత్రికలు, మీడియాలో వచ్చే వ్యతిరేక కథనాలపై స్పందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల అధికారులతో సమీక్షించారు. జిల్లా ప్రజలకు అందిస్తున్న సేవలు.. పలు లోపాలపై వివిధ పత్రికల్లో వస్తున్న వార్తలపై కచ్చితంగా స్పందించాలని.. క్షేత్రస్థాయిలో పనులు జరిగేలా చూడాలని సూచించారు. ప్రతి అధికారి పూర్తిస్థాయిలో సేవలందించాలన్నారు. సూర్యఘర్ యోజన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిర్దేశించిన గడువు లోగా గృహ నిర్మాణాలు పూర్తికావాలన్నారు. ఈ సమావేశంలో జేసీ శోభిక, డీఆర్వో హేమలత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విలీనం ఆపాలి

- గొట్టమంగళాపురం వాసుల ఆందోళన


ఎంఈవోకి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

పాలకొండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గొట్టమంగళాపురం ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను గోపాలపురం పాఠశాలలో విలీనం చేయడాన్ని ఆపాలని విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా విద్యా కమిటీ చైర్మన్ జి.రవి మాట్లాడుతూ గొట్టమంగళాపురం పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈవోకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థుల తోపాటు సీఐటీయూ నాయకులు దావాల రమణారావు, కాద రాము పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీలపై అలసత్వం తగదు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలోని చెత్త సంపద కేంద్రాల(ఎస్‌డబ్ల్యూపీసీలు) నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో జి.పైడితల్లి, మండల విస్తరణాధికారి ఎల్.గోపాలరావులు హెచ్చరించారు. 'చెత్త నుంచి సంపద ఎలా..?' అనే శీర్షికతో ఆంధ్ర జ్యోతిలో సోమవారం కథనం వెలువడింది. ఈ కథనంపై స్పందించిన అధికా రులు మండలంలోని కొత్తపల్లి, రావుపల్లి, పెద్దూరు, గరుగుబిల్లి, రాయిందొర వలస, వల్లరిగుడబ, సంతోషపురంలోని సంపద కేంద్రాలను వారు పరిశీలిం చారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ గ్రామాల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తలను వేరు చేసి ఎరువులు తయారీపై దృష్టి సారించాలన్నా రు. పంచాయతీలవారీగా నిర్దేశించిన ఎరువులు తయారు చేయకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పరిశీలనలో సంతోషపు రం సర్పంచ్ అంబటి తవిటినాయుడు, కార్యదర్శులు పి.మధు, సాయికుమా ర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు 76 వినతులు

ఒడిశా

రాయగడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ సమావేశ హాలులో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. కలెక్టర్ పారుల్ పట్వారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమం లో 76 మంది అర్జీదారులు వినతులు అందజేశారు. వీటి ని పరిశీలించిన కలెక్టర్.. పది మందికి వైద్యం సహాయం కోసం ముఖ్యమం త్రి సహాయ నిధి నుంచి రూ.82వేలు ఆర్థిక సహాయం అందించారు. మిగతా సమస్యలను పరిశీలించి.. వెంటనే వాటిని పరిష్కరించవలసిందిగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ చంద్రకాంత్ మాఝి, గ్రామీణ నీటి సరఫరా సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ సొత్తు స్వాధీనం

రాయగడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అంబోదల పోలీసుస్టేషన్ పరిధిలో గత ఏడాది డిసెంబరు నెల 9న జరిగిన బంగారు నగల చోరీ కేసును జిల్లా పోలీసులు ఛేదించారు. ఓ బాలనేరస్థుడిని అదుపులోకి తీసుకుని చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ సోమవారం వివరాలను వెల్లడించారు. ఆమె తెలిపిన వివరాల మేరకు.. అమలాపేటకు చెందిన మహేశ్వర్ నాయక్ అంబోదలలో బంగారు నగల వ్యాపారం చేస్తున్నాడు. అతను దుకాణం తెరిచేందుకు వెళ్లి 500 గ్రాముల నగల సంచిని పక్కన పెట్టి దుకాణం తాళాలు తీస్తున్న సమయంలో అదను చూసిన నిందితుడు నగల సంచిని తీసుకుని పారిపోయాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు గంజాం జిల్లా అస్కాకు చెందిన ఓ బాల నేరస్థుడిని అదుపులోనికి తీసుకున్నారు. 430 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకుని, బాధితునికి అప్పగించారు. ఈ కార్యక్రమంలో రాయగడ ఎస్డీపీవో రష్మిరంజన్ సేనాపతి, బిసంకటక్ ఎస్డీపీవో సంతోషి, అంబోదల ఐఐసీ కల్పనా బెహరా తదితరులు పాల్గొన్నారు.

రహదారి సరే.. కాలువపై పలకలేవీ?

- మూడేళ్లగా కొనసాగుతున్న విస్తరణ పనులు
- ఇబ్బందులు పడుతున్న వీరఘట్టం పట్టణ వాసులు


జూనియర్ కళాశాల రోడ్డులో కాలువపై పలకలు లేని దృశ్యం

వీరఘట్టం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరఘట్టం ప్రధాన రహదారి విస్తరణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రహదారి విస్తరణ పనులు ప్రారంభించి సుమారు మూడేళ్లు అవుతున్నా పనులు మాత్రం సాగుతూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక రెండో పొర బీటీ వేశారు. కానీ కాలువపై పలకలు మాత్రం అసంపూర్తిగా ఉన్నాయి. చాలా చోట్ల పలకలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేసిన పలకలు కూడా నాణ్యతా లోపం కారణంగా విరిగిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువపై పలుకలు పూర్తిస్థాయిలో వేయాలని ప్రజలు కోరుతున్నారు.

- ఈ విషయం ఆర్‌అండ్‌బీ శాఖ జేఈ టి.కిరణ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా త్వరలో రహదారికి ఇరువైపులా కాలువపై పూర్తిస్థాయిలో పలకలు వేస్తామని తెలిపారు.

ఆ మలుపు ప్రమాదాలకు పిలుపు

- చర్యలు తీసుకోని అధికారులు


ఆరికతోట సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు

రామభద్రపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆరికతోట గ్రామ సమీపంలో గల జాతీయ రహదారిలో ఉన్న మలుపు ప్రమాదాలకు పిలుపుగా ఉంది. ఈ జాతీయ రహదారి నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఇటీవల రోడ్ల విస్తరణ పనులు చేపట్టినప్పటికీ ఈ మలుపును తొలగించ లేదు. ఈ మలుపు కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కూడా కనిపించ కపోవడంతో గతంలో ఎన్నో సార్లు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అయిన ప్పటికీ ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు ఈ మలుపు తొలగించ లేదు. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా సరిగ్గా ఏర్పాటు చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని మలుపును తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

- ఆర్డీవో రామ్మోహనరావు
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం


బొబ్బిలి రూరల్: తహసీల్దార్ కార్యాలయంలో నోటిఫికేషన్ ప్రదర్శిస్తున్న ఆర్డీవో రామ్మోహనరావు

బొబ్బిలి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైందని, దీంతో జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని బొబ్బిలి ఆర్డీవో జీవీఎస్ రామ్మోహనరావు తెలిపారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆయన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఫిబ్రవరి 3న నోటిఫికేషన్, 10 వరకు నామినేషన్ల స్వీకరణ, 11న పరిశీలన, 13న నామినేషన్ల ఉపసంహరణ, 27న పోలింగ్, మార్చి 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని, మార్చి 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. డివిజన్ వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలని అధికారులు, నాయకులకు సూచించారు. నియమావళి అమలుకు బృందాలను ఏర్పాటు చేశామని, నియమాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఎం.శ్రీను, ఏఈఆర్వో, టీడీపీ, బీజేపీ, వైసీపీ, జనసేన ప్రతినిధులు, ఎన్నికల ఉప తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నోటిఫికేషన్ ప్రదర్శన

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా దీనికి సంబంధించిన ఎన్నికల నోటీసు ఫారం-1 పత్రాన్ని సోమవారం బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయంలో నోటీసు బోర్డులో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జీవీఎస్ రామమోహనరావు తోపాటు తహసీల్దార్ ఎం.శ్రీను, ఉప ఎన్నికల తహసీల్దార్ గౌరీశంకరరావు పాల్గొన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈ ఎన్నికలలో నియోజకవర్గం మొత్తం మీద 775 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని చెప్పారు.

గరుగుబిల్లి రెవెన్యూ కార్యాలయంలో..

గరుగుబిల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు సంబంధించి సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ పి.బాల ఎన్నికల నోటిఫికేషన్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11న పరిశీలన, 13లోగా ఉప సంహరణ చేసుకోవచ్చునన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ఈనెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తారని చెప్పారు. ఓట్లు లెక్కింపు మార్చి 3న జరుగుతుందన్నారు. ఎన్నిక కారణంగా మార్చి 8వ తేదీ వరకు ఎన్నికల నియమావళి ఉంటుందన్నారు. ఎన్నికల నియమావళిని ధిక్కరిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ బి.సుందరరావు, సీనియర్ సహాయకులు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

సీతానగరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్సీలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 8వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ బి.ధర్మారావు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 8వ తరగతిలో 45, ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీ, ఎంపీసీలలో 90 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పు గోదావరి, కాకినాడ, పశ్చిమ గోదావరి, అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, కృష్ణ జిల్లాల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపించాలని కోరారు. దరఖాస్తుల స్వీకరణకు మార్చి 9వ తేదీ వరకు గడువు ఉందని చెప్పారు.

వెంగళరాయ సాగర్‌లో చేప పిల్లలు విడుదల


చేప పిల్లలు విడిచిపెడుతున్న దృశ్యం

సాలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినచీపురువలస పరిధిలో ఉన్న వెంగళరాయసాగర్‌లో మత్స్య అభివృద్ధి అధికారిణి వైశ్రీదేవి, ఎంఆర్వో వెంకటరమణ ఆధ్వర్యంలో సోమవారం ఐదు లక్షల 94 వేలు చేప పిల్లలను విడిచిపెట్టారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన 2020-21లో భాగంగా చేపపిల్లలను విడిచి పెట్టామని చెప్పారు మత్స్య సంఘం అధ్యక్షులు సురపాటి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు


మందులపై తేదీలను పరిశీలిస్తున్న జగన్మోహనరావు

సీతానగరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని నిడగల్లు, కేడీ వలస గ్రామాల్లోని వెల్‌నెస్ కేంద్రాలను ఆయన సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. వైద్య పరీక్షలు, ఆరోగ్య సర్వేల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ ఆరోగ్య కేంద్రాల్లో విధిగా ఓపీ నిర్వహించాలని, ప్రజల ఆరోగ్య సమస్యలు స్పష్టంగా తెలుసుకుని తగు వైద్యం అందించాలని సూచించారు. కేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉండాలని, ఆరోగ్య కార్యక్రమాల రీత్యా కేంద్రం నుంచి వెళ్లేటప్పుడు మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

- సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారి రామారావు


జిల్లాలోని కేజీబీవీ ప్రిన్సిపాల్స్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పీవో రామారావు

బాడంగి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కేజీబీవీల్లో మౌలిక వసతులు మెరుగు పరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారి ఎ.రామారావు అన్నారు. బాడంగి కేజీబీవీ వసతి గృహాన్ని ఆయన సోమవారం సందర్శించారు. తొలుత విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం జిల్లాలో ఉన్న మిగిలిన కేజీబీవీల ప్రిన్సిపాల్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలోని వసతి గృహాల్లో కొంతవరకు మౌలిక వసతుల కొరత ఉందని, ఈ కొరతను తీర్చేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపించామని చెప్పారు. త్వరలోనే వీటికి సంబంధించిన ఆదేశాలు వస్తాయన్నారు. ఇక్కడ లేబరేటరీకి మూడు తరగతి గదులను మంజూరు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో హారికా, జీసీడీవో, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్త పనులకు ప్రతిపాదనలు పంపాలి

- ఉపాధి హామీ పనులపై సిబ్బందితో అధికారుల సమావేశం


రామభద్రపురం: మాట్లాడుతున్న ఏపీడీ రమామణి

రామభద్రపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా రానున్న వేసవి కాలంలో కొత్త పనుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని ఏపీడీ రమామణి సూచించారు. సోమవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఆమె ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వేతనదారులను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది మండలానికి మంజూరైన 67 గోకులాల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరంలో హార్టీకల్చర్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో గొలగాని త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

రెండు పూటలు పని చేయాల్సిందే..

సాలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి వేతనదారులు రెండు పూటలు పని చేయాలని మండల ఏపీవో కృష్ణంనాయుడు తెలిపారు. ఆయన సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని 29 పంచాయతీల్లో సుమారు నాలుగు వేలమంది ఉపాధి వేతనదారులు పని చేస్తున్నారని తెలిపారు. వేతనదారులు ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు, మళ్లీ సాయంత్రం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు రెండు పూటల ఉపాధి పనికి హాజరు కావాలని ఆయన కోరారు. ఒక పూట పనిచేసి రెండో పూట పనికి రాకపోతే ఉదయం వేసిన మస్టర్ రద్దు చేస్తామన్నారు.

అర్హులందరికీ పని కల్పించాలి

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి.రవి కుమార్ ఆధ్వర్యంలో ఏపీవో లక్ష్మీపతిరాజు పర్యవేక్షణలో మండలంలోని క్షేత్ర, సాంకేతిక సహాయకులకు సోమవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా ఏపీడీ కె.రమామణి పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఆదేశించారు. ఇచ్చిన లక్ష్యం ప్రకారంగా పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు.

న్యూస్ బాక్స్

ఏరియా ఆసుపత్రికి రోగుల తాకిడి

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏరియా ఆసుపత్రికి సోమవారం రోగుల తాకిడి పెరిగింది. వాతావరణంలో నెలకొన్న మార్పుల కారణంగా జ్వరం, ఒళ్లునొప్పులు, దగ్గు వంటి లక్షణాలతో రోగులు అధిక సంఖ్యలో ఏరియా ఆసుపత్రికి క్యూ కట్టారు. సోమవారం ఓపీ 355 వచ్చిందని సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు.

ఎమ్మెల్యేని కలిసిన జనసేన నాయకులు

బొబ్బిలి/రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయనను జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం బొబ్బిలిలోని ఆయన స్వగృహంలో కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యేతో చర్చించారు.

సాగునీరు విడుదలకు సన్నాహాలు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని ఎడమ ప్రధాన కాలువ నుంచి సాగు, తాగు నీరు విడుదలకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రబీలో ఆరుతడి పంటల సాగు తో పాటు ప్రస్తుత తాగునీటి అవసరాలకు మంగళవారం నీరు విడుదల చేయనున్నట్టు పాత రెగ్యులేటర్ జేఈ డీవీ రమణ సోమవారం స్థానిక విలేకర్లకు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి నిల్వలు తక్కువగా ఉండటం తో మొదటి దఫా తక్కువ క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని చెప్పారు.

సీతారామానాయుడికి పురస్కారం

గరుగుబిల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రావివలస గ్రామానికి చెందిన గంట సీతారామానాయుడు తెలుగు వెలుగు నంది పురస్కారానికి ఎంపికయ్యారు. ఈయన గత 35 ఏళ్లుగా పౌరాణిక నాటకాలతో పాటు హార్మోనియంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన పలువురిని కళాకారులుగా తీర్చిదిద్దారు. పౌరాణిక నాటక రంగానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారు. దీంతో ఆయనకు సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నంది పురస్కారం అందించారు.

పారా అథ్లెటిక్స్‌లో గిరిజన విద్యార్థి ప్రతిభ

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా మంగళగిరిలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ రన్నింగ్ పోటీల్లో గిరిజన విద్యార్థి పత్తిక రాజేష్ బంగారు పతకం సాధించాడు. ఈతమానుగూడ గ్రామానికి చెందిన రాజేష్ సీతంపేట ఐటీడీఏ పరిధిలోని ఏపీఆర్ బాలుర గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. బంగారు పతకం సాధించిన రాజేష్‌ను కోచ్ రాజేష్, గురుకుల పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

నీటి ఎద్దడి నివారణకు దృష్టి సారించాలి

రామభద్రపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి కాలంలో పంచాయతీల్లో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో రత్నం అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా బోర్లు పాడైతే వెంటనే బాగు చేయాలని సూచించారు. అలాగే రక్షిత తాగునీటి పథక బావుల్లో క్లోరినేషన్ చేపట్టాలని తెలిపారు. ఇళ్ల పన్నుల వసూళ్లు ముమ్మరం చేయాలన్నారు. ఈవోపీఆర్డీ వెంకటరమణ, జూనియర్ అసిస్టెంట్ చిట్టూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

- ఎంపీడీవో కార్యాలయాల వద్ద కూరగాయల స్టాల్స్


బాడంగి: కూరగాయల స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రకృతి పద్ధతిలో పండించిన కూరగాయల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- రామభద్రపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రకృతి కూరగాయల పెంపకంపై రైతులు దృష్టి సారించాలని ఎంపీడీవో రత్నం సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నేచురల్ ఫార్మింగ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రకృతి పద్ధతిలో పండించిన వివిధ రకాల కూరగాయలను ప్రదర్శించారు. మండలంలోని రొంపల్లి, మిర్తివలస గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి జీవామృతం, కషాయాల ద్వారా కూరగాయల పెంపకం చేపడుతున్నారని తెలిపారు. ప్రతి సోమవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద కూరగాయల స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రదర్శించిన గద ఆనపకాయలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యూనిట్ ఇన్‌చార్జి పి.సూర్యకుమారి, ఉమా, ఎస్.రవణమ్మ పాల్గొన్నారు.

పైనాపిల్ సాగుపై క్షేత్ర పర్యటన

- కేరళ వెళ్లిన గిరిజన రైతులు

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మారిషస్ పైనాపిల్ పంట సాగు విధానాలను తెలుసుకునేందుకు సీతంపేట ఐటీడీఏ నుంచి పలువురు గిరిజన రైతులు కేరళ రాష్ట్రం పర్యటనకు వెళ్లారు. సోమవారం అక్కడకు చేరుకున్న గిరిజన రైతులు.. మారిషస్ పైనాపిల్ పంట సాగు కోసం అక్కడ రైతులు అనుసరిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే అక్కడ ఉన్న పైనాపిల్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. మారిషస్ పైనాపిల్ ప్రాసెసింగ్ చేసే పద్ధతిని అక్కడ రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. గిరిజన రైతులతో పాటు పీహెచ్‌వో వెంకటగణేష్, జయశ్రీ, దివాకర్ ఉన్నారు.